
ప్రజాశక్తి
బుధవారం 11 డిసెంబర్ 2024





కోలాటం ఆడుతున్న మహిళలు



ప్రదర్శన నిర్వహిస్తున్న సిపిఎం శ్రేణులు

ఉత్సాహంగా సిపిఎం మహాసభ

- ప్రత్యేక ఆకర్షణగా మహిళల కోలాటం, రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు
- పాలకుల నిర్లక్ష్యం వల్లే మన్యం వెనుకబాటు
- దృష్టి మళ్లించేందుకు మత చిలికలు
- వనరులున్నా వినియోగానికి చొరవ చూపని పాలకులు
- గిరిజన ప్రాంతం పట్ల వివక్ష
- ఎర్రజెండా అండతో ప్రజా పోరాటాలు
- సిపిఎం మహాసభలో నాయకులు



మహాసభ ప్రాంగణంలో సిపిఎం జెండాను ఎగురవేస్తున్న సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి

సిపిఎం మన్యం జిల్లా 10వ మహాసభలు కురుపాంలో అత్యంత ఉత్సాహ పూరితంగా మంగళ వారం ప్రారంభ మయ్యాయి. మహాసభ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు హాజరయ్యే ందుకు గిరిశిఖర గ్రామాల ఆదివాసి గిరిజనులు తెల్లవారక ముందే కొండలు గుట్టలు దాటుకుంటూ కురుపాం మండల కేంద్రానికి చేరుకున్నారు. కొందరు మహిళలు చంటి బిడ్డలను ఎత్తుకుని, వృద్ధులు ఊత కర్రలు పట్టుకుని ర్యాలీ, సభలలో పాల్గొనడం విశేషం. కొందరు యువకులు విల్లంబులు చేతబూని గిరిజన సంప్రదాయ వేటను, అడవితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. ఇటు మైదాన ప్రాంతాలకు చెందిన పార్టీ శ్రేణులు కూడా భారీగా చేరుకున్నారు.

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి, కురుపాం, పార్వతీపురం

సిపిఎం మన్యం జిల్లా మహాసభ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా కురుపాం చేరుకున్నారు. పరస్పర పలకరింపులు, ఆలింగనాలతో ఆ ప్రాంతంలో పండగ వాతావరణం కనిపించింది. అనంతరం కురుపాం పాత బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా రావాడ జంక్షన్ వరకు భారీ ప్రదర్శన సాగింది. ప్రదర్శన ముందు వరుసలో ఎర్ర జెండాలను చేబూనిన మహిళలు సమరోత్సాహాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా కురుపాం ప్రధాన రహదారి ఎర్రబారింది. అగ్రభాగంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. పుణ్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, కె.సుబ్బారావమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్, జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు నిలిచారు. ప్రదర్శనకు ముందు భాగంలో మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మరోవైపు రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు కమ్యూనిస్టుల క్రమశిక్షణకు అద్దం పట్టింది. బహిరంగ సభలో నాయకుల ప్రసంగాలు పార్టీ కేడర్‌ను ఉత్తేజపరిచాయి. పోరాటంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని, అటువంటి పోరాట స్ఫూర్తి మన్యం ప్రాంతం కొన్ని దశాబ్దాల క్రితమే అందించిందని గుర్తు చేశారు. నాటి స్ఫూర్తితో నేడు గిరిజనులు, మైదాన ప్రాంత వాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడేందుకు సిపిఎం సిద్ధమవుతోందని అన్నారు. ఆ దిశగా నేటి మహాసభల్లో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. బహిరంగ సభ అనంతరం కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్, బుద్ధదేవ్ భట్టాచార్య ప్రాంగణం రుద్రరాజు సత్యనారాయణ రాజు వేదికగా (సాయినందక కళ్యాణ మండపం)లో ప్రతినిధులసభ ప్రారంభమైంది. మహాసభల ప్రారంభ సూచికగా సిపిఎం జెండాను సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి ఆవిష్కరించారు. ప్రతినిధుల సభకు అధ్యక్షవర్గంగా ఎం.తిరుపతిరావు, మర్రి శ్రీనివాసరావు, రెడ్డి శ్రీదేవి, మండంగి రమణ వ్యవహరించారు. తొలుత అమరుల చిత్రపటాలకు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంతకుముందు రావాడ జంక్షన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి మాట్లాడారు. లాటీలు తూటాలతో జరిగిన నిర్బంధాలను, బెదిరింపులను ఎదుర్కొనే చరిత్ర పార్వతీపురం మన్యం జిల్లాకు ఉందని గుర్తు చేశారు. పల్లె రాములు మాస్టారు, న్యాయవాదైన పరవాడ లక్ష్మనాయుడు సహకారంతో కురుపాం, గుమ్మలక్ష్మం పురం ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమానికి అంకురార్పణ జరిగిందని తెలిపారు. నాటి నుంచి ప్రజా సమస్యలపైన, ముఖ్యంగా గిరిజనుల దోపిడీకి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నడిచాయని గుర్తు చేశారు. అయినప్పటికీ మన్యం జిల్లా, ముఖ్యంగా గిరిజన ప్రాంతం విద్య వైద్యం రహదారులు తదితర సదుపాయాలకు నేటికీ దూరంగానే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మన్యంలో జరిగిన నాటి పోరాట స్ఫూర్తితో తోటపల్లి నిర్వాసితుల కోసం సిపిఎం పోరాడి మెరుగైన నష్టపరిహారం, పునరావాసం కల్పించిందని, అలా అందర్నీ ఏకం చేయగలిగే శక్తి ఎర్రజెండాకు మాత్రమే ఉందని అన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ జిల్లాలో సాలూరు, పాచిపెంట, సీతంపేట భామిని తదితర ప్రాంతాల్లో భూ సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి సిపిఎం పోరాడుతుందని అన్నారు. గిరి శిఖర గ్రామాల్లో విద్య, వైద్యం , రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు లేవన్నారు. వీటన్నిటి పైన మహాసభల్లో చర్చించి పరిష్కారానికి తగిన కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు.

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో సాగు, తాగునీరు, గిరిజనుల హక్కుల సాధనకు 1/70 చట్టం అమలు కావాలంటే కేవలం ఎర్రజెండా సిపిఎం తప్ప ఇంకే పార్టీలు గిరిజనుల పక్షాన నిలబడవని అన్నారు.

వెనుకబాటుతనంపై నోరెత్తని ఎమ్మెల్యేలు



అత్యంత వెనుకబడిన మన్యం జిల్లా సమస్యలపై ఈ ప్రాంత ఎమ్మెల్యేలు నోరు మెదపడం లేదు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు మెరుగైన వైద్యం కోసం తగిన ఆసుపత్రి లేదు. నిత్యావసర ధరలు భారీగా పెరిగాయి. సమస్యలను పక్కదారి పట్టించేందుకు ఒకే దేశం, ఒకే ఎన్నికల పేరుతో మతచిచ్చు రేపాలని బిజెపి ప్రయత్నిస్తోంది

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బారావమ్మ

ఆశ్రమ పాఠశాలల్లో అక్షయపాత్రపై పోరాటం



గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా భోజనాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అన్న క్యాంటీన్లకు సరఫరా చేస్తున్న రీతిలో ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం పంపిణీ చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దీని వల్ల విద్యార్థులకు పౌష్టికాహారం అందబోదు. వందలాది మంది ఉపాధి కోల్పోతారు. ఆశ్రమ పాఠశాలలో ఎఎన్ఎంల నియామకంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది.

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్

గిరిజనుల ఎదుగుదలకు బిజెపి ఆటంకం : తులసీదాస్

ఆదివాసి గిరిజనుల ఎదుగుదలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర ఆటంకంగా మారిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. గడచిన పదేళ్లలో గిరిజన చట్టాలను బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. గిరిజనులు పోరాడి సాధించుకున్న గిరిజన కార్పొరేషన్ ద్వారా గతంలో అటవీ ఉత్పత్తులను సేకరించి గిట్టుబాటు ధర కల్పించే వారని, నేడు అటువంటి సేవలు అందించే పరిస్థితిలో ఆ సంస్థ లేదని అన్నారు. వీటన్నిటితో పాటు ఎన్నికల హామీలను అమలు చేయాలని గిరిజనులు పోరాడుతుంటే వారిని, మతం, తెగల పేరుతో గిరిజనుల మధ్య చిచ్చు పెడుతోందని విమర్శించారు. పిటిజిల సమస్యలు పరిష్కరించేందుకు, సవర భాషా వాలంటీర్లను కొనసాగించేందుకు మేనమేషాలు లెక్కిస్తుందని విమర్శించారు. ఈ నేపథ్యంలో మన్యంలో గత పోరాటాలను పూర్తిగా తీసుకొని ప్రభుత్వం మెడలు వంచేందుకు ప్రజలంతా కదలాలని పిలుపునిచ్చారు.



కవాతు నిర్వహిస్తున్న రెడ్‌షర్ట్ వాలంటీర్లు



మాట్లాడుతున్న రెడ్డి వేణు

సాగునీటి ప్రాజెక్టుల నిర్లక్ష్యం



రాష్ట్రంలో మన్యం జిల్లా అత్యంత వెనుకబడిన జిల్లాగా ఉంది. వనరులున్నా పాలకులు వినియోగించడం లేదు. 50ఏళ్ల గా జంఝావతి ప్రాజెక్టును పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఏటా బడ్జెట్ లో జంఝావతి ప్రాజెక్టుకు రూ.5 కోట్లు కేటాయించినట్లు చెప్పడం తప్ప ఆచరణలో శూన్యం. రాష్ట్ర విభజనలో భాగంగా మంజూరైన గిరిజన యూనివర్సిటీని మెంటాడలో నిర్మాణానికి గత ప్రభుత్వం హయాంలో శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు కూడా జరుగుతున్నాయి. టిడిపి ప్రభుత్వం ఈ గిరిజన యూనివర్సిటీని అక్కడ నుంచి తరలిస్తామని చెబుతుండడం అన్యాయం. పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయి.

- సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి



విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం ముచ్చర్లవలసలో ప్రతు జిన్నింగ్ మిల్లు వద్ద కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్)

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన సిసిఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) జిల్లాలో పత్తి రైతులను ఈ ఏడాది నిండా ముంచేసింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో పత్తి రైతు నెత్తిన సిసిఐ శఠగోపం పెట్టింది. రెండు జిల్లాల్లో అవసరమైన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. తద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర రైతులకు అందకుండా చేయడంలో సిసిఐ కీలక పాత్ర పోషించింది. విజయనగరం జిల్లాలో రామభద్రపురం మండలంలోని ప్రతు జిన్నింగ్ మిల్లు యాజమాన్యానికి మేలు చేసేలా వ్యవహరించింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో క్వింటాకు వెయ్యి రూపాయల చొప్పున నష్టానికి రైతులు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పత్తి రైతు నెత్తిన

సిసిఐ శఠగోపం

- కొనుగోలు కేంద్రాల మంజూరులో జాప్యం
- గతిలేక ప్రయివేటు వ్యాపారులకు విక్రయాలు
- జిన్నింగ్ మిల్లు యాజమాన్యంతో కుమ్మక్కు!

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ ఏడాది 14,800 ఎకరాల్లో పత్తి పంట సాగైంది. ఇంత పెద్ద ఎత్తున సాగవుతున్న పంటని కొనుగోలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడంలో సిసిఐ తీవ్రంగా విఫలమైంది. విజయనగరం జిల్లాలో కేవలం నాలుగు వేల ఎకరాల్లో మాత్రమే పత్తి పంట సాగవుతోంది. వరి తర్వాత రెండు జిల్లాల్లో ఎక్కువగా పత్తి పంట సాగు చేస్తున్నారు. ఈ ఏడాది పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని ఊహించిన వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు ఎక్కువ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలి. సిసిఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత మార్కెటింగ్ అధికారులపై ఉంది. కేవలం విజయనగరం జిల్లా రామభద్రపురం మండలంలోని ముచ్చర్లవలసలో ఉన్న ప్రతు జిన్నింగ్ వద్ద ఒకే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రెండు జిల్లాల్లో పండించిన పత్తిని ఈ కొనుగోలు కేంద్రానికే తీసుకువెళ్లాలని చెప్పి అధికారులు చేతులు దులుపుకున్నారు. వంద నుంచి 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండలాల నుంచి రామభద్రపురం మండలంలోని ప్రతు జిన్నింగ్ మిల్లుకు పత్తి తీసుకెళ్తే రవాణా ఖర్చు తడిసి మోపెడవుతుంది. దీంతో రైతులు ప్రయివేటు వ్యాపారులకు పత్తి అమ్మేశారు. ఇప్పటికే రైతులు పండించిన పత్తిలో 80 శాతం వ్యాపారులకు చేరింది. ప్రతు జిన్నింగ్ మిల్లు యాజమాన్యం ఏజెంట్ల ద్వారా గ్రామాల్లో పత్తిని కొనుగోలు చేయించింది. క్వింటా పత్తి మద్దతు ధర రూ.7100 నుంచి 7500 రూపాయల వరకు ఉంటే వ్యాపారులు రూ.6100 నుంచి రూ.6300కే కొనుగోలు చేశారు. దీంతో రైతులు క్వింటాకు వెయ్యి రూపాయల వరకు నష్టపోయిన పరిస్థితి దాపురించింది.

ప్రతిపాదనలు పంపడంలో వైఫల్యం

మన్యం జిల్లాలో పత్తి సాగు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఎక్కువ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు పంపడంలో జిల్లా అధికారులు విఫలమైనట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వం ద్వారా సిసిఐపై ఒత్తిడి పెంచి ఎక్కువ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా చూడడంలో మార్కెటింగ్ అధికారులు నిర్లక్ష్యం వహించారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చేతులు కాలాక..

జిల్లాలో పత్తి సాగు చేసిన దాదాపు అన్ని మండలాల్లో పత్తిని ప్రయివేటు వ్యాపారులకు విక్రయించారు. అయితే ఇప్పుడు జిల్లాలో భామినిలో మరో కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు మార్కెటింగ్ జిల్లా అధికారులు చెబుతున్నారు. సీతంపేట, పాలకొండ, భామిని మండలాల్లో పత్తి సాగు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలుస్తోంది. మొదటి సారి ఏరిన పత్తి దాదాపు 20 వేల క్వింటాళ్ల వరకు వ్యాపారులు కొనేశారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా అధికారులు ఇప్పుడు మరో కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిన వ్యవహారముంది.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా

మరుగుదొడ్లు మంజూరు

- కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
- అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం

ప్రజాశక్తి-పార్వతీపురం



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

జిల్లాలో 7,500 వ్యక్తిగత మరుగుదొడ్లు అవసరమని అధికారులు నివేదిక ఇచ్చారని, వాటిని స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ద్వారా మంజూరు చేస్తామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. అవసరమైతే మరిన్ని మరుగుదొడ్లను మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. ఒక్కో యూనిట్‌కు రూ.15 వేలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ ముగింపు కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతకు మారుపేరుగా నిలిచిన మూడు ప్రభుత్వ కార్యాలయాల అధికారులకు కలెక్టర్ జ్ఞాపికలను అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మరుగుదొడ్ల వినియోగంపై ప్రజల్లో అవగాహన లేమి కారణంగా ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో, సంతలు, దేవాలయాల చుట్టుపక్కల బహిరంగ మల విసర్జన జరుగుతుందన్నారు. తద్వారా పరిసరాల అపరిశుభ్రతతోపాటు పర్యావరణానికి హాని కలుగుతుందని అభిప్రాయపడ్డారు. బహిరంగ మలవిసర్జనను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించినా కొందరు వాటిని వినియోగించడం లేదన్నారు. సామాజిక మరుగుదొడ్లు సరైన నిర్వహణ లేక నిరుపయోగంగా ఉన్నట్లు తెలిపారు. ప్రజల్లో అవగాహన లేకపోతే ప్రభుత్వం ఎన్ని నిధులు వెచ్చించినా ఉపయోగం ఉండబోదని, ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను సక్రమంగా వినియోగించులాకునేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వ్యక్తిగత మరుగుదొడ్లను ఎంత పరిశుభ్రంగా ఉంచుతామో, తమ కార్యాలయాల్లోని మరుగుదొడ్లను కూడా అంతే శుభ్రంగా ఉంచుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

స్వచ్ఛతతోపాటు విద్యుత్, తాగునీరు ఆదా చేసిన మూడు ప్రభుత్వ కార్యాలయాల అధికారులకు కలెక్టర్ జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఒ.ప్రభాకరరావు, డిపిఒ టి.కొండలరావు, ఇతర జిల్లా అధికారులు, స్వచ్ఛ సేవకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

13న కురుపాంలో మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈ నెల 13న కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ ఒక ప్రకటన జారీ చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా (మెకానికల్, ఇసిఇ, ఇఇఇ), ఏదైనా డిగ్రీ చదువుకొని 18 నుంచి 28 ఏళ్ల వయస్సు గల నిరుద్యోగ యువత జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని చెప్పారు. తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. రిఫరెన్స్ నెంబరు, బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 63034 93720 నంబర్‌ను సంప్రదించవచ్చని వివరించారు.

నెలాఖరికి రహదారి పనులు పూర్తి

సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

ప్రజాశక్తి-మక్కువ


శంబర పోలమాంబ ఆలయాల వద్ద, గ్రామంలో చేపట్టే రహదారి పనులను ఈ నెలాఖరికి పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ.. పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు మంగళవారం మక్కువ మండలంలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. తొలుత కొండ బుచ్చంపేటలో రెవెన్యూ సదస్సును ఆయన సందర్శించారు. వచ్చిన వినతులపై తహశీల్దార్ షేక్ ఇబ్రహీంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శంబర గ్రామంలో నడుమవీధి పనుల గురించి పంచాయతీరాజ్ జెఇ రజిత్‌తో మాట్లాడారు. రహదారి విస్తరణ ఏవిధంగా చేస్తున్నారు? ఎన్ని రోజుల్లో పని పూర్తవుతుంది? అనే విషయాలపై ఆరాతీశారు. రహదారికి అడ్డంకులు ఏమైనా ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. పది రోజుల్లో పని పూర్తి చేస్తామని పిఆర్ జెఇ రజిత్ తెలిపారు. అనంతరం జాతరకు సంబంధించిన తేదీలను స్థానిక పెద్దలను, దేవాదాయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లు, దర్శన స్థలాలను పరిశీలించారు. అనంతరం పోలమాంబ ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు ఆలయ ఉద్యోగి మురళి, ఎంపిటిసి టి.పోలినాయుడు.. అమ్మవారి చిత్రపటం అందజేశారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్

ఎన్ని రోజుల్లో స్తంభాలు మారుస్తారు ?

ఆలయానికి ఎదురుగా ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించాలని స్థానిక నాయకులు.. సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంటనే స్పందిస్తూ స్తంభాలను తొలగించడానికి ఎన్ని రోజులు పడుతుందని విద్యుత్తు శాఖ ఎఇ జి.జోగినాయుడు ప్రశ్నించారు. స్తంభాలను మార్చేందుకు రూ.2.50 లక్షల చలానా తీయాలని, అది పూర్తయిన రెండు రోజుల్లో కొత్త స్తంభాలను ఏర్పాటుచేస్తామని ఎఇ తెలిపారు. అనంతరం ఎఎస్ఐ శ్రీనివాస్‌తో పార్కింగ్ విషయంపై మాట్లాడారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి దేవకుమార్, ఆర్ఐ శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ అల్లు వెంకటరమణ, ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ పూడి దాలినాయుడు, మాజీ సర్పంచ్ అక్కేనా తిరుపతిరావు పాల్గొన్నారు.



దీక్షలు కొనసాగిస్తున్న గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

బెదిరింపులు ఆపండి

ప్రజాశక్తి-పార్వతీపురం

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులపై బెదిరింపులు ఆపి, వారి సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు సత్యనారాయణ, సురేష్, గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు తాడంగి సాయిబాబు అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం పార్వతీపురం ఐటిడిఎ కార్యాలయం వద్ద చేపడుతున్న గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల దీక్షలకు వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షోకాజ్ నోటీసులు ఇవ్వడం, వేరే పాఠశాల ఉపాధ్యాయులకు డెప్యుటేషన్ వేసి బెదిరింపులకు పాల్పడటం మానుకోవాలని హితవుపలికారు. చాలీచాలని జీతాలతో విద్యా సేవలు అందించిన వారికి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టంచేశారు. వీరి భవిష్యత్తు పోరాటాలకు బాసటగా ఉంటామని తెలిపారు.

ఫేక్ హక్కుల నేతలతో జాగ్రత్త

ఎన్‌హెచ్‌ఆర్‌సి జిల్లా అధ్యక్షులు చప్ప

ప్రజాశక్తి - మక్కువ

హక్కుల నేతలమంటూ ఫేక్ ఐడిలు సృష్టించుకుని హల్ చల్ చేస్తున్న వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎన్‌హెచ్‌ఆర్‌సి ప్రెసిడెంట్ చప్ప వెంకటరమణ అన్నారు. జిల్లాలో కొంతమంది వ్యక్తులు వారి స్వార్థం కోసం హక్కులు నేతలుగా చెప్పుకుంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని ఏ విధమైన గుర్తింపు లేని సంస్థలు పేరుతో చలామణి అవుతున్నారని చెప్పారు. మంగళవారం విశాఖలో జరిగిన ఎన్‌హెచ్‌ఆర్‌సి సమితి పెద్దల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లామన్నారు. ఎవరైనా ఇలాంటి మోసగాల చేతిలో నష్టపోతే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. త్వరలో జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన ప్రజాశక్తికి తెలిపారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి-వీరఘట్టం

రైతుల భూసమస్యలు రెవెన్యూ సదస్సులతో పరిష్కారం అవుతాయని తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని తూడి, నర్సిపురం గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఐ లక్ష్మునాయుడు, జనసేన నాయకులు రౌతు పవన్ కుమార్, మండల ఉపాధ్యక్షులు పి.విజయకుమారి, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి - కురుపాం

గ్రామ పంచాయతీల్లో సహస్రాబ్ది లక్ష్యాల సాధనకు సర్పంచ్, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది శిక్షణను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఇటీవల శిక్షణ పొందిన ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వేణుగోపాల్, పంచాయతీ రాజ్ ఎఇ నాగేశ్వరరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు వివిధ రకాల అంశాలపై అవగాహన కల్పించారు. లక్ష్యాల సాధనకు సూచనలు చేశారు. ఎంపిపి శెట్టి పద్మావతి, ఇఒపిఆర్‌డి రమేష్ బాబు పాల్గొన్నారు.

ఆయాల జీతాలు చెల్లించండి


ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలు, నైట్ వాచ్‌మేన్‌గా పనిచేస్తున్న వారికి జీతాల బకాయిలు చెల్లించాలని పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం పార్వతీపురంలో ఆయన మాట్లాడుతూ ఎనిమిది నెలల నుంచి గౌరవ వేతనం చెల్లించకపోవడంతో వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తక్షణమే గౌరవ వేతనం విడుదల చేయాలని కోరారు.

నడిమికెల్లలో పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని నడిమికెళ్ల గ్రామంలో మంగళవారం ఎఒ సౌజన్య ఆధ్వర్యాన వరి పొలంలో పంటకోత ప్రయోగం చేపట్టారు. ఎం.సింహాచలం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఆర్‌జిఎల్ 2537 రకం సాగుచేయగా, ఎకరాకు 25 బస్తాలు దిగుబడి వచ్చినట్లు ఎఒ తెలిపారు.



సదరం శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్టు రేఖ

ఏరియా ఆస్పత్రిలో సదరం శిబిరం

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఏరియా ఆస్పత్రిలో మంగళవారం సదరం శిబిరం నిర్వహించారు. ఐదుగురికి నేత్ర సంబంధించిన వ్యాధులను గుర్తించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, ఆర్ఎంఒ డివి శ్రీనివాస్, ఆప్తాలమిస్ట్ రేఖ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలోని డివిఎం మున్సిపల్ హైస్కూల్, 14వ వార్డులో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం వైద్య సిబ్బంది పరీక్షలు చేశారు. ఈ పరీక్షలను వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు పర్యవేక్షించారు. విద్యార్థులతో మాట్లాడి ఏవైనా అనారోగ్య సమస్యలు గుర్తించారా? అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో ఆరోగ్యపరమైన సమస్యలను ముందస్తుగానే గుర్తించడానికి హెల్త్ స్క్రీనింగ్ దోహద పడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.వరప్రసాద్, పి.గోవింద, ఎపిడెమిక్ ఇఒ సత్తిబాబు, హెల్త్ సూపర్వైజర్ పుష్ప, వైద్య సిబ్బంది ఉమ, సుజాత పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని, ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమేష్‌నాయుడు తెలిపారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటుచేశారు. ప్రస్తుత సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేయడానికి ఫేక్ లోన్ యాప్‌ల ద్వారా సామాజిక మాధ్యమాలలో లింకులను పంపిస్తున్నారని తెలిపారు. అందులో పెట్టుబడి పెట్టాలని నమ్మిస్తున్నారని చెప్పారు. త్వరగా డబ్బు సంపాదించుకోవాలని అత్యాశకు వెళ్లి మోసపోవద్దని కోరారు. ప్రజలు వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ తెలపొద్దని, ఏ అధికారులు ఫోన్లో వ్యక్తిగత సమాచారం అడగరని స్పష్టంచేశారు. ఎవరైనా బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ఒటిపి అడిగితే చెప్పొద్దని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉంటూ మీ చుట్టుపక్కల వారిని కూడా జాగ్రత్త పరచాలని కోరారు. ఈ సందర్భంగా పోక్సో కేసుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొత్స రవికుమార్, గుల్ల శంకర్రావు, కొట్నాన మురళీ మోహన్, హెడ్ కానిస్టేబుల్ జి.రాము, తదితరులు పాల్గొన్నారు.

కాలువల నిర్మాణం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం గ్రామంలో చింతలగూడ వీధిలో కాలువలు నిర్మిస్తున్నట్లు సర్పంచి బి.గౌరీశంకర్రావు తెలిపారు. మంగళవారం మట్టి తవ్వకాల పనులు చేపట్టారు. వర్షం పడితే వీధి మొత్తం నీరు చేరి బురదమయంగా మారుతుందని ఆయన తెలిపారు. స్థానికుల సమస్యను దృష్టిలో కాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

చిదిమిలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలో చిదిమి గ్రామంలో మంగళవారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, మధుమేహ, రక్తపోటు తదితర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ పి.నారాయణరావు తెలిపారు. రెండు రోజుల కిందట కురుపాం విఆర్ఒ పువ్వల మహేంద్ర పోలీసు స్టేషన్‌కు వచ్చి కాంప్లెక్స్ ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి మరణించి ఉన్నట్లు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

సిపిఎం మహాసభ దృశ్యమాలిక



ప్రదర్శనలో పాల్గొన్న సిపిఎం జాతీయ, రాష్ట్ర నాయకులు



అమరవీరుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పుణ్యవతి



ప్రదర్శనలో విల్లుతో గిరిజనుడు



బహిరంగ సభకు హాజరైన సిపిఎం శ్రేణులు, ప్రజలు



సభకు చంటిబిడ్డతో హాజరైన మహిళ

సక్రమంగా పనిచేయకుంటే సరెండరే

ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రజాశక్తి-కొమరాడ

సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సక్రమంగా పనిచేయకపోతే సరెండర్ చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హెచ్చరించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా పనితీరు, ప్రగతి నివేదికలు వివరించాలని ఎంపిడిఒ మల్లికార్జునరావు అధికారులకు సూచించారు. హౌసింగ్ శాఖలో బిల్లుల చెల్లింపులు, కొత్త ఇళ్ల గురించి ఎఇ రాము వివరించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు స్పందిస్తూ మండలంలో 2016-19 కాలంలో మంజూరై మధ్యలో బిల్లులు నిలిచిపోయిన ఇళ్లకు బిల్లులు చెల్లించడం లేదని ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని గుర్తుచేశారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఆ ఇళ్లకు బిల్లులు పెట్టేందుకు నిర్లక్ష్యం వహించడంతో బిల్లుల చెల్లింపులు ఆగిపోయాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పనితీరు మార్చుకోవాలని ఎమ్మెల్యే హెచ్చరించారు. నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ బిల్లులు పెట్టకుండా లబ్ధిదారులకు ఇబ్బంది పెట్టిన పరశురాంపురం ఇంజినీరింగ్ అసిస్టెంట్ వి.సాయిపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చెబుతున్నా, కనీసం వారి మాటలను వినకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సమాధానం చెప్పడంపై ఎంపిడిఒ మరింత ఆగ్రహం వ్యక్తం చేసి, ఆయనకు సభలోనే షోకాజ్ జారీ చేశారు. వివిధ పనులు చేయని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకూ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు. అనంతరం వివిధ శాఖల పనితీరుపై ఎమ్మెల్యే సమీక్షించారు. గతంలో ఉన్న వైసిపి ఎంపిటిసిలకు అభివృద్ధి పనుల కోసం ఎంపిడిఒ నిధులు కేటాయిస్తున్నారు తప్ప అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా టిడిపి ఎంపిటిసిలకు నిధులు ఇవ్వడం లేదని విక్రంపురం ఎంపిటిసి డి.వెంకట్‌నాయుడు, గంగరేగువలస ఎంపిటిసి వెంకట నాయుడు, గుణానపురం ఎంపిటిసి సంతోషి.. ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. వచ్చే బడ్జెట్లో టిడిపి ఎంపిటిసిలకు గతంలో, కొత్తగా మంజూరు చేయాల్సిన నిధులు కేటాయించి, అన్ని గ్రామాలను అభివృద్ధి చేయాలని ఎంపిడిఒను ఆదేశించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హౌసింగ్ వివరాలను వెల్లడిస్తున్న ఎఇ రాము

సంక్షోభంలోనూ సంక్షేమ పాలన

కొమరాడ : రాష్ట్రంలో సంక్షోభం ఉన్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తోందని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. మంగళవారం కొమరాడ మండలంలోని ఉలిపిరి పంచాయతీ రామభద్రపురం నుంచి అల్లువాడకు రూ.1.40 కోట్లతో బిటి రహదారి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం ఉలిపిరి, చోళపదం గ్రామ సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. చోళపదంలో ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సు ఆమె మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పాటు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు డబ్బులిచ్చి అభివృద్ధిలో రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి నెట్టారని విమర్శించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం వంటి సదుపాయాల కల్పనకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు, పంచాయతీరాజ్ ఎఇ పి.ఫణీష్‌బాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు వీరేష్ చంద్రదేవ్, జి.సుదర్శన్, మండల అధ్యక్షులు సేనాపతి శేఖర్ పాత్రుడు పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగించొద్దు

జిల్లా జడ్జి దామోదరరావు

ప్రజాశక్తి-పార్వతీపురం

ఆర్టికల్ 26 ప్రకారం ఒకరి హక్కులకు మరొకరు భంగం కలిగించకూడదని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు తెలిపారు. మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ కళాశాల మృత్యుంజయ అడిటోరియంలో సెట్విజ్ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను దుర్వినియోగం చేయకుండా కాపాడుకోవాలని సూచించారు. విద్యాహక్కు చట్టం ద్వారా ప్రతిఒక్కరూ ఉచిత విద్యను పొందే హక్కు కలిగి ఉన్నారని తెలిపారు. చదువుకోవడానికి స్థానికత అవసరం లేదన్నారు. హక్కుల కోసం పోరాడాలని, లేకపోతే బానిసలుగా బతకాల్సి వస్తుందని చెప్పారు.

ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ మాట్లాడుతూ బాలకార్మికులను ప్రోత్సహించకూడదని చెప్పారు. బాల్య వివాహాలు నేరమని, వాటికి చట్టంలో కఠిన శిక్షలు అమలవుతున్నాయని తెలిపారు. అదనపు ఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను సోషల్ మీడియాలో చాలా మంది దుర్వినియోగం చేస్తున్నారన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తుల హక్కులకు భంగం కలిగించేలా పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది జోగారావు, సెట్విజ్ సిఇఒ, జిఎస్‌డబ్ల్యుఒ బి.రాంగోపాల్ వర్మ, ఎబి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.ఎస్. స్వరూప్, ఎపి మానవ హక్కుల కమిటీ జనరల్ సెక్రటరీ పి.సంతోష్, కోచ్ అశ్విని, దినేష్, ఎన్.టి.ఆర్ ట్రస్ట్ సభ్యులు ఎం.అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి దామోదరరావు

పార్వతీపురంటౌన్ : ప్రతిఒక్కరూ మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ జి శ్రీనివాసరాజు, పట్టణ సిఐ మురళీధర్ అన్నారు. మంగళవారం పట్టణంలో పాత బస్టాండ్ వద్ద జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వలిరెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అనంతరం స్థానికులకు ఆహార పొట్లాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి జిల్లా లీగల్ అడ్వైజర్ మజ్జి వెంకటేష్, ఉపాధ్యక్షులు గేదెల సర్వేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, వావిలపల్లి సూర్యనారాయణ, సభ్యులు గొర్లి రామకృష్ణ, కురుమోజు గణేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నాణ్యమైన పదార్థాలు అందించాలి

ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన సంక్షేమ వసతిగృహాలకు, గురుకులాలకు నాణ్యమైన ఆహార పదార్థాలు పంపిణీ చేయాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ.. ట్రేడర్లను ఆదేశించారు. ఫుడ్ ప్రావిజన్స్ (ఆహార పదార్థాలు) టెండరు ప్రక్రియ స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో పిఒ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. వీటిని జిసిసి ద్వారా ఐటిడిఎ పరిధిలోని అన్ని సంక్షేమ వసతిగృహాలకు, గురుకులాలకు పంపిణీ చేయనున్నట్లు పిఒ తెలిపారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల నాణ్యతలో రాజీ పడరాదని స్పష్టంచేశారు. టెండరు ఖరారైన ట్రేడర్లు నిర్ణీత సమయానికి నాణ్యతతో కూడుకున్న సరుకులను అందించాలని ఆదేశించారు. సకాలంలో పంపిణీ చేయకుంటే సరుకులు తిప్పి పంపించాలని, వారిని బ్లాక్‌లిస్టులో పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టెండర్ల ప్రక్రియలో మొత్తం 14 మంది ట్రేడర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన

ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి -భామిని

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డి.. ఉపాధ్యాయులను ఆదేశించారు. భామిని మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఐటిడిఎ పిఒ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని అన్ని తరగతి గదులను పరిశీలించారు. పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మెనూ అమలును పరిశీలించి, విద్యార్థులతో కలిసి పిఒ మధ్యాహ్న భోజనం చేశారు. ప్రతిరోజూ భోజనం రుచికరంగా వండాలని సూచించారు. మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రవి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్

ప్రణాళిక ప్రకారం చదవాలి

సీతంపేట : పదో తరగతి విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివితే మంచిమార్కులు సాధిస్తారని ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ నారాయుడు సూచించారు. మండలంలో పెద్దపొల్ల గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ నెలాఖరికి సిలబస్ పూర్తిచేయాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులను గ్రేడ్లుగా విభజించి, వెనుకబడిన విద్యార్థులపై దృష్టిసారించాలని ఆదేశించారు. అవసరమైతే వారిని దత్తత తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.భాస్కరరావు, డిప్యూటీ వార్డెన్ కె.అప్పన్న, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్ల పరిశీలన

ప్రజాశక్తి-పాచిపెంట

గత ప్రభుత్వంలో మంజూరైన జగనన్న హౌసింగ్ లేఅవుట్లను మంగళవారం విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. పాచిపెంట మండలంలో 30 లేఅవుట్లు ఉన్నాయి. అందులో మంగళవారం పాచిపెంట, కర్రివలస, పెంద్రంగివలస, అమ్మవలస, పి.కోనవలస, పెద్దచీపురువలస, చిన్న చీపురువలస లేఅవుట్లను హౌసింగ్ విజిలెన్స్ అధికారులు కామేశ్వరరావు, పి.వెంకటేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నాయి, ఎన్ని పూర్తయ్యాయో పరిశీలించి అక్కడ ఉన్న లబ్ధిదారులతో మాట్లాడారు. కాలనీలో మౌలిక సదుపాయాల వాకబు చేశారు. రోడ్లు, కాలువలు నిర్మించాలని లబ్ధిదారులు విజిలెన్స్ అధికారులను కోరారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు



మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ రాణి

పంటల బీమా చేయించుకోవాలి



సీతంపేట.. మాట్లాడుతున్న ఎడి రత్నకుమారి

ప్రజాశక్తి-పాచిపెంట

రబీలో పంటల బీమా నమోదు చేసుకోవాలని ఎఒ కె.తిరుపతిరావు.. రైతులకు సూచించారు. మండలంలోని కుడుమూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న, పెసర పంటలకు ఈ నెల 15, వరి పంటకు 31వ తేది వరకు గడువు ఉందని చెప్పారు. మరింత సమాచారం కోసం గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఎఎ భారతి, ప్రకృతి సేద్య సిఆర్‌పి సురేష్ పాల్గొన్నారు.

తుంబకొండలో పొలం పిలుస్తోంది

సీతంపేట : మండలంలో తుంబకొండ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎడి రత్నకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అవగాహన కల్పించారు. రబీలో వరి, మొక్కజొన్న బీమా గురించి వివరించారు. చిరుధాన్యాలు సాగు విస్తీర్ణం పెంచాలని సూచించారు. వచ్చే రెండు రోజుల్లో వర్షం పడే అవకాశం ఉందని, రైతులెవరూ వరి కోతలు చేయకూడదని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

రంగంపేటలో పొలంపిలుస్తోంది

సీతానగరం : మండలంలోని రంగంపేటలో మండల వ్యవసాయ అధికారి అవినాష్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మొక్కజొన్న పంటలో మెలకువలను రైతులకు తెలియజేశారు.

కిశోర వికాసం.. భవిష్యత్తుకు పునాది

ప్రజాశక్తి-గరుగుబిల్లి

బాలికలకు కిశోర వికాసం కార్యక్రమం ఒక వరమని, అది వారి బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని ఐసిడిఎస్ పీడీ ఎన్.ఎం.రాణి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం కిశోర వికాసం కార్యక్రమంపై శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకునేలా, సమగ్ర అభివృద్ధి సొంతం చేసుకునేలా ఈ కార్యక్రమం ద్వారా చేయూతనిస్తున్నట్లు తెలిపారు. కిశోర బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ఇందుకోసం ప్రతి గ్రామంలోనూ బాలికల సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతోపాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎంపిడిఒ జి.పైడితల్లి మాట్లాడుతూ కిశోర బాలికలకు సరైన విజ్ఞానం అందించి, జీవితంలో అన్ని విధాలా ఎదిగేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎస్ఐ పి.రమేష్‌నాయుడు మాట్లాడుతూ బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. డిజిటల్ భద్రత, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి గొట్టాపు సుగుణకుమారి, డిసిపిఒ ఎ.సత్యనారాయణ, వైద్యాధికారి కెకె సాగర్ వర్మ, ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రౌతు లక్ష్మి, అరుణకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.